క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి రూ.1500, మరో ముగ్గురికి రూ.1000 , ఒకరికి రూ.2000 చొప్పున జరిమానా విధించారు. అలాగే, ఇద్దరికి రెండు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉ.10 గంటల నుంచి 11 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సేవల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలను 9063417161 నంబర్‌కు ఫోన్ చేసి వివరించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్త్ పరీక్ష కేంద్రం పరిశీలన



సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

నారాయణఖేడ్: 21 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని గురువారం నాగల్‌గిద్ద ఎంఈఓ మన్మథ కిషోర్ పరిశీలించారు. తరగతి గదులతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాల గురించి హెచ్‌ఎం శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు రాఘవేందర్ గౌడ్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజనం చేస్తున్న అధికారులు, విద్యార్థులు

సంగారెడ్డి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ శంకర్ సూచించారు. గురువారం చౌట్కూర్ మండలం బోమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించాలని, చేతులు శుభ్రంగా కడుకున్న తర్వాతే వంట చేయాలని, పరిసరాలు, వాష్ రూంలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్ శోభను ఆదేశించారు. పిల్లలందరూ బాగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, సీఆర్పీ ఆంజనేయులు ఉన్నారు .

చదువులో ప్రేరణ ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ గాయత్రి

జహీరాబాద్ టౌన్: చదువులో ప్రేరణ ముఖ్యమని, లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి ఉపయోగపడుతుందని ఇంపాక్ట్ ట్రైనర్ పటోళ్ల సంగీత అన్నారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు హైస్కూల్ విద్యార్థులకు గురువారం మోటివేషన్ తరగతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటించాలని, కష్టమనకుండా ఇష్టంగా చదవాలన్నారు. పోయిన సమయం తిరిగిరాదని ఎప్పటి పనులు అప్పుడే చేసుకోవాలని సూచించారు. కొత్త విషయాలను తెలుసుకోనేందుకు నిత్యం అన్వేషిస్తుండాలని, గొప్పవారి జీవిత చరిత్రను చదువుతుండాలని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ శాంతకుమార్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నారాయణఖేడ్: మండలంలోని హన్మంత్‌రావుపేట్, సంజీవన్‌రావుపేట ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఏబీవీపీ ఖేడ్ నగర కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు బోర్డు పరీక్షలను ధైర్యంగా రాసి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఏబీవీపీ నాయకులు విజయ్, విగ్నేష్, శివాజీ, నవీన్, చందు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో డ్రమ్ముల లోడ్‌తో వెళ్తూ..



సంగారెడ్డి-జహీరాబాద్ రహదారిపై పైపులు తీసుకెళ్తూ



నందికంది శివారులో రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనం

ప్రయాణం.. ప్రమాదకరం

వాహనదారులు ఇష్టానుసారంగా పరిమితికి మించి వాహనాల్లో లోడ్ వేసుకొని ప్రయాణిస్తుంటారు. పట్టు తప్పకుండా తాళ్లతో కట్టుకుని ఓవర్ లోడ్‌ను తీసుకెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్లే వాహనాలు పరిమితికి మించి లోడ్ చేసుకుని వెళ్తున్నారు. అలాగే, పలువురు రాంగ్ రూట్‌లో వెళ్తారు. తాళ్లు తెగిపోయినా, అదుపు తప్పినా వెనుక ప్రయాణిస్తున్న వారి పరిస్థితి ఏంటని ఆలోచించకుండా ప్రయాణాలు సాగిస్తున్నారు.

– సంగారెడ్డి జోన్

అడ్డూఅదుపులేని మట్టి మాఫియా

- ప్రభుత్వ భూముల నుంచి అక్రమ రవాణా
- అటువైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ యంత్రాంగం

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాలు అక్రమ మట్టి మాఫియాకు కేంద్ర బిందువుగా మారాయి. పట్టా, పరంపోగు వంటి భూముల్లో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి రవాణాతో కోట్లు గడిస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే సాగుతున్న అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి

ధనార్జనే ధ్యేయంగా..

ధనార్జనే ధ్యేయంగా ప్రకృతి దోపిడీకి మట్టి మాఫియా యథేచ్ఛగా పాల్పడుతున్నారు. ఉమ్మడి జిన్నారం మండలంలోని అన్నారం, గడ్డపోతారం, సోలక్‌పల్లి, దోమడుగు, బొంతపల్లి ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఇటుక బట్టీలు ఉన్నాయి. విస్తరిస్తున్న నగర నిర్మాణానికి ఈ వ్యాపారం మంచి లాభాలను తెచ్చిపెడుతుంది. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పారిశ్రామిక వాడలు ఉండడంతో నిత్యం పరిశ్రమల్లోకి మట్టిని తరలిస్తుంటారు.

ప్రభుత్వ భూములే లక్ష్యం

జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతానికి దగ్గరలో ప్రభుత్వ భూమి ఉందంటే చాలు వారి పంట పండినట్లే రాత్రికి రాత్రి వందల సంఖ్యలో టిప్పర్లు, ఇటాచీలు దింపి తెల్లవారేలోపు గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం సాగిస్తున్నారు. జిన్నారం మండలం వావిలాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 190లోని కొంతభూమిని ప్రభుత్వం టీజీఐఐసీలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించింది. ఈ స్థలంపై మట్టి మాఫియా కన్ను పడింది. అంతే ఒకటి, రెండు రాత్రుల్లో వందల సంఖ్యల టిప్పర్లతో మట్టిని తవ్వి తరలించారు. అలాగే, జిన్నారం మండలం రాళ్లకత్వ పరిధిలో కొన్ని నెలలుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడి గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు బాహాటంగా గ్రూపులుగా ఏర్పడి శివానగర్‌లో ఏర్పాటు కానున్న ఎల్ఈడి పార్కు పరిశ్రమల నిర్మాణానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఈ మట్టికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టిప్పర్‌కి రూ.6నుంచి రూ.7వేల ధర పలుకుతుంది. మట్టి రవాణా అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై దాడులకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 79 సీలింగ్ భూమి నుంచి సైతం మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటాచీతో మట్టిని తరలిస్తున్న టిప్పర్

పట్టించుకోని అధికార యంత్రాంగం

కళ్లముందు ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం తమకు పటీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి రవాణాపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, అధికారుల అండదండలతో సాఫీగా సాగుతుందని చెబుతున్నారు. అక్రమ రవాణాపై ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములు, ప్రకృతిని కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం..**
>
> 
>
> అక్రమమట్టి రవాణాకు పాల్పడితే ఉపేంక్షించేది లేదు. వాహనాలకు భారీ జరిమానా విధిస్తాం. తీరు మారకపోతే వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తాం . రాత్రుంబవళ్లు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులకు సూచించం. అక్రమ మట్టి రవాణాపై ఉక్కుపాదం తప్పదు.
>
> – తహసీల్దార్ భిక్షపతి, జిన్నారం

ఆస్తిపన్ను పెనాల్టీపై రాయితీ కల్పించాలి

జహీరాబాద్ టౌన్: ఆస్తిపన్ను పెనాల్టీపై 90 శాతం రాయితీ కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్‌కు విన్నవించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నామ రవికిరణ్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నుపై రాయితీ కల్పించారని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందన్నారు. జహీరాబాద్ పట్టణంలో అధిక శాతం మంది పేదలు ఉన్నారని, ఇక్కడ కూడా ఆస్తిపన్ను పెనాల్టీపై 90 శాతం రాయితీ కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు యాకూబ్, మోహన్, శివప్ప, అబ్దుల్లా, ప్రభుయాదవ్, రాకేష్, నరేష్‌రెడ్డి ఉన్నారు.



మనోజ్‌కు వినతిపత్రం ఇస్తున్న రవికిరణ్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

రాయికోడ్(అందోల్): ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన సీసీ, మెటల్ రోడ్ల నిర్మాణ పనులు ఈ నెల 25లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కర్చల్, హస్నాబాద్, ఔరంగానగర్, సింగితం, ఇందూర్, రామోజిపల్లి, రాయికోడ్, కుసునూర్, కోడూర్, సిరూర్, మామిడిపల్లి, రాయిపల్లి, సంగాపూర్, నాగన్‌పల్లి, నాగ్వార్, ఖాంజమాల్‌పూర్ గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు సాగుతున్నాయి. అలాగే, రాయికోడ్-జంమ్గి గ్రామాల మధ్య, నాగ్వార్ నుంచి న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్ మధ్య మెటల్ రోడ్ల నిర్మాణానికి పనులు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో సీసీ, మెటల్ రోడ్ల నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైనట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేస్తేనే బిల్లులు వస్తాయని వివరించారు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ జోగప్ప

కంది(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ జోగప్ప పేర్కొన్నారు. గురువారం కంది లక్ష్మీనగర్‌లోని ఎంపీపీఎస్‌లో టీచింగ్ లర్నింగ్ మెటీరియల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. టీఎల్ఎం కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. అలాగే సెన్స్‌పై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



టీఎల్ఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జోగప్ప

వినియోగదారులకు మెరుగైన సేవలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ చాలా బలంగా ఉందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ నందాకుమార్, సీఈ కామేష్, ఎస్ఈ శ్రీనాథ్, డీఈ భాస్కర్ స్థానిక అధికారులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ముషారఫ్ అలీ

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని కోనాపూర్‌లో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. పండితులకే కాకుండా పామరులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి ప్రజలకు అందజేసిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలని కొనియాడారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు కృష్ణ, అంజయ్య, సంగయ్య, విఠల్, నర్సింలు, సంగమేష్, ప్రవీణ్ కుమార్, శివకుమార్, గోపాల్, బక్కప్ప పాల్గొన్నారు.

త్వరితగతిన పన్ను వసూలు

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

సంగారెడ్డి జోన్: గ్రామపంచాయతీల్లో 100 శాతం పన్ను వసూళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 67శాతం పన్నువసూలు పూర్తయిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ అందించే 25 శాతం రాయితీపై అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సమావేశంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

31లోగా ఆస్తిపన్ను వసూలు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్తి పన్నులను మార్చి31వతేదీలోపు వందశాతం వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ రీజియన్ ఆర్‌డీఎంఏ జె.శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆస్తిపన్నుల వసూలపై అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరం ముగింపునకు 17రోజులు మాత్రమే ఉందన్నారు. వందశాతం ఆస్తి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న డీఎస్పీ

నారాయణఖేడ్: ప్రజలు పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హోలీ పండగతో పాటు అన్ని పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఒకరి ఆనందం కోసం మరొకరికి ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. సీఐ శ్రీని వాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం పాల్గొన్నారు.

◆ **శాంతికమిటీ సమావేశం**

సదాశివపేట(సంగారెడ్డి): ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని సీఐ మహేశ్‌గౌడ్ ప్రజలకు సూచించారు. గురువారం జిల్లా ఎస్పీ పరితోష్ ఆదేశాల మేరకు సదాశివపేట, కొండాపూర్, మునిపల్లి మండలాల పోలీస్‌స్టేషన్‌ల అధికారుల ఆధ్వర్యంలో అన్ని వర్గాల మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హోలీ, రంజాన్ పండుగలను సోదరభావంతో జరుపుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.

◆ **ఇతరులను ఇబ్బంది పెట్టొద్దు**

న్యాల్‌కల్(జహీరాబాద్): కులమత భేదాలు లేకుండా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు పేర్కొన్నారు. గురువారం మండలంలోని హద్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అన్ని వర్గాల పెద్దలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మన వల్ల ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. హోలీ, రంజాన్ పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

◆ **ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు**

పటాన్‌చెరు టౌన్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగలు జరుపుకోవాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హోలీ , రంజాన్ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, మసీద్‌ల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయండి

అడిషనల్ కలెక్టర్ మాధురి

సంగారెడ్డి జోన్: ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండల, గ్రామ, మున్సిపల్ కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజువారీ రిపోర్ట్ అందించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్, మండలాల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులలో ఏ సమస్యలు లేకుండా పరిష్కరించాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ముందస్తు హోలీ వేడుకలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముందస్తు హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. మధుర, కొన్యాల, చీకుమద్దూర్, బ్రాహ్మణగుడా గ్రామాల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకొని హోలీ సంబరాలు వేడుకగా జరుపుకొన్నారు.

మున్సిపాలిటీలో..

జహీరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళలు హోలీ వేడుకలు జరుపుకొన్నారు. గురువారం మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని మినీ హోలీ వేడుకలను ఆస్వాదించారు. వేడుకల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య, మెప్మా సీఓ అనిత, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.



జహీరాబాద్: రంగులు చల్లుకున్న మహిళలు



హత్నూర(సంగారెడ్డి): హోలీ వేడుకల్లో యువకులు

సంక్షిప్త వార్తలు

◆ **15న అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సమావేశం**

జహీరాబాద్: ఈ నెల15న అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ రాంచందర్ భీంవంశీ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జహీరాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే సమావేశంలో అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విషయమై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ డీజీఎం శివకుమార్‌లతో కలిసి బండ్లగూడలోని మార్క్స్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని కాలనీలో ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మేనేజర్ అరుణ్ , సిబ్బంది గోవింద్, జావిద్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా అట్టుకల్ పొంగల్ వేడుకలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో కేరళ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అట్టుకల్ పొంగల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సింధు రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా కేరళ సంఘం ఆధ్వర్యం ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి పొంగలి నైవేద్యం సమర్పించడం సంప్రదాయమని తెలిపారు.

◆ **స్కూల్ బస్సును ఢీకొట్టిన కారు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కేగేట్ సమీపంలో బుధవారం సెంటిన్స్ స్కూల్‌కు చెందిన బస్సును ఓ కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థులు సురక్షితంగా బయటపడటంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

◆ **అనుమానాస్పదంగా వ్యక్తి అదృశ్యం**

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణంలోని మార్క్స్‌నగర్ కాలనీకి చెందిన షేక్ మహబుబ్(40), ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం తన యాజమాని ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసిన స్పందించక పోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం కల్వకుంట నుంచి చిమ్నాపూర్ గ్రామానికి వెళ్లేమార్గంలోని ఎర్రకుంట చెరువు ఒడ్డున అతనికి సంబంధించిన దుస్తులు, చెప్పులు ఉండటం గమనించారు. కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకొని మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ **బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు**

సంగారెడ్డి: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో కలపాలని పార్లమెంట్ జీరో అవర్‌లో మాట్లాడిన ఎంపీ డీకే అరుణ వైఖరిని తెలంగాణ ఎరుకల సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వారి వ్యాఖ్యాలను వెంటనే విరమించుకోవాలి లేనిచో బీజేపీ, ఎంపీ డీకే అరుణపై ఎస్టీ సామాజికవర్గం ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

◆ **పల్లకీ సేవాకు ఘన స్వాగతం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మిర్జాపూర్(ఎన్)కు చేరుకున్న పాదయాత్ర-పల్లకీ సేవా కార్యక్రమానికి పీఠాధిపతులు నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. నారాయణఖేడ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకీ సేవా గురువారం ఉదయం మిర్జాపూర్(ఎన్)కు చేరుకుంది. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర మహరాజ్ తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.